# కాకులు - గ్రద్దలు

''నువ్వీడ కొలువుదీరి కూర్చోనుండావా సామీ! గంటసేపుణ్ణించీ యెతకతా వుండాను. యెక్కడా కనబడకపోయేటప్పటికి, అడివికి రాకుండా, యింట్లోనే కాళ్లు జాపేసినావేమోనని అనుకుంటిని''- అన్నాడు మునస్వామి, చెట్టు నీడలోని రాతిపైన కూర్చుంటూ.

వేపచెట్టు మొదలునానుకుని కూర్చున్న తిరిపాలు, గొర్రెపిల్ల నోటికి లేత కొమ్మల్ని అందించుతూ, ''కాళ్లు బార్లాజాపేస్తే నాకెట్లా గడుస్తాది మామా! నీమాదిరిగా నేనేమయినా గవర్మెంటు వుద్దోగం చేస్తా వుండానా యేమి?'' అంటూ కిసుక్కుమని నవ్వేశాడు.

అతడి మాటలు చెవిని బడనట్టుగా, చెమటతో తడిసిన ముఖాన్ని టవలుతో తుడుచుకోసాగాడు మునస్వామి. తరువాత చొక్కా బొత్తాలు విప్పుకుని, టవలులో విసురుకోసాగాడు. చాలానిదానికి 'వుఫ్‌వుఫ్' అని నోటితో గాలిని వూదుకో సాగాడు. కొంచెం కుదుటపడిన తరువాత ''యీ సమత్సరం యెండలు పోయిన తడవకంటే ఎక్కువగా వుండాయి...'' అంటూ చుట్టూ అడవికేసి కలయ జూశాడు.

సూర్యుడు నడినెత్తిపైకి రావడంతో నీడలన్నీ చెట్లకిందే నక్కి కూచున్నాయి. పచ్చని చెట్టు మచ్చుకైనా కనిపించని పాలకొండలు యెండధాటికి శోషొచ్చి పడిపోయిన యేనుగుల గుంపులా కనిపిస్తున్నాయి. దూరంగా, కొండరాజు కోనలో సూనికి పైగా యెండిపోయిన చెట్లే కనిపిస్తున్నాయి.

''వొరే తిరిపాలూ - కట్టెలోళ్లు యెవరైనా నీకు అగుపించినారా?'' అని అడిగాడు మునస్వామి.

''యీ పొద్దెవరూ కనబల్లేదు మామా!'' అన్నాడు తిరిపాలు.

''అబద్దాలు చెప్పొద్దురా నాతో... నిజం చెప్పు...''

''వూరికేనే నా మీద యెగరతావేంది మామా! నేను నీకు అబద్ధాలు చెబ్తానా. చెప్పు...''

మునస్వామి మరోసారి కొండరాజుకోనకేసి చూపులు సారించాడు.

యెండకు భయపడి పక్షులు కూడా గూళ్లలోనే దాక్కున్నట్టున్నాయి. అడివంతా నిశ్శబ్దంగా వుంది.

రావిచెట్టు నీడలో పడుకుని, నెమరేసుకుంటున్న మేకలనంతా పరిశీలించి చూసిన తరువాత, ''నా పొట్టేలు అగుపించడం లేదు. యెట్లబోయిందో చూసినావా?'' అని అడిగాడు మునస్వామి.

''మిగతావి యేమైపోయినా ఫరవాలేదు గానీ నీ ధ్యాసంతా నీ పొట్టేలు పైన్నే! అన్నీ యీడ్నే వుండేటప్పుడు అది మాత్రం యెక్కడికి బొయ్యుంటుంది? బాగా జూడు. యిక్కడ్నే యాడ్నో వుంటాది'' అన్నాడు తిరిపాలు.

మరోసారి మందని గాలించిన తరువాత ''ఆ పక్క నల్లబండ పక్క పండుకోనుండే పొట్టేళ్లు నాకప్పుడు అగుపించలేదులే తిరిపాలూ! వుండాది... నా పొట్టేలు గూడా ఆడ్నే వుండాది. ఆ బండ పక్కనించి రెండోది... అదే గదా?'' అంటూ అడిగాడు మునస్వామి.

''రెండేదిగాదు... మూడోది. కంటికి నదురుగా కనబడతావుంది గదా అని రెండోదని ప్లేటు మారస్తా వుండావు. నీ బుద్ధి నాకు తెలియదా? నీది ఆ మూడో పొట్టేలు. మెడకాడ నల్లసార కొట్టచ్చినట్టుగా కనబడతా వుండాది గదా! నువ్వీ మాదిరిగా రోజుకొక పాట పాడతావుండావనే నేను గజ్జెల దండ తెచ్చివ్వమని చెప్పినాను. దాన్ని నీ పొట్టేలు కేగదా కడతానని చెప్పినాను. నీకు పైసా ఖర్చు లేకుండా అప్పనంగా పొట్టేలింటికాడి కొచ్చేయాల...'' విసుక్కున్నాడు తిరిపాలు.

''నువ్వు మాత్రమేమయినా కొండలు పిండి గొడ్తావుండావా? పొద్దున లేచి, సద్ది తాగేసి, చంకకు చిక్కం తగిలించుకోని, అడివికి మేకల్ని తోలుకొచ్చినాక నువ్వుచేసే పనేముండాది? నీ పాటికి నువ్వు బీడీలు గాల్చుకుంటా వుంటే, మేకల పాటికి మేకలు మేనుకుంటా వుంటాయి. మద్దానమయినా కాకుండానే, చిక్కం ఖాళీ చేసేసి, యే చెట్టుకిందనో సవకం పరుచుకోని గురకపెడ్తావు. మందలోనయితే భద్రంగా వుంటుంది గదా అని నా పొట్టేల్ని గూడా నీ మందలో పెట్టినందుకు పెద్ద యిదిగా వుండేటట్టుంది నీకు! వూరికే యేమయినా మేపతా వుండావా? అడవిలో కొచ్చేదానికి పర్మిషనిచ్చిందానికి మేపతా వుండావు. యింతల మాత్రానికి అంత అక్కసేల నీకు?'' మునస్వామి దబాయించాడు.

అతడికి కోపమొచ్చినట్టు తిరిపాలు కర్థమయినట్టుంది. అయినా అడగవలసిన నాలుగు మాటల్నీ నవ్వుతూనే అడిగేశాడు. ''మొత్తంమీద నీ అంత తెలివైన గారుడ్డు నువ్వే మామా! నా దగ్గిర తీసుకున్న పొట్టేలు పిల్లను యింకొకడి మందలో బెడ్తావు. యెవురో యిచ్చిన పిల్లను నా మందలో చేర్చేస్తావు. వుత్త పుణ్యానికి అడివిలోకి రానిచ్చినట్టు వడ్డారం మాటలు చెప్తావు...''

మునస్వామికి చిర్రెత్తుకొచ్చింది. కాస్సేపు మాట్లాడకుండా మవునంగా వుండిపోయాడు.

అడివిలోని చెట్లన్నీ మెల్లమెల్లగా తలలూపుతున్నాయి. గాలి సైతం వేడిగా వీస్తోంది.

''మీ మేకలోళ్లకు కండ్లు నడినెత్తిపైకొచ్చినాయి. వచ్చే నెలనించీ యెవుడ్నిగానీ అడివిలోకి అడుగుబెట్టనిచ్చేది లేదు. యేం చేస్తారో చూస్తాను...''

తిరిపాలు యెదురు మాట్లాడలేదు. యిలాంటి మాటల్ని సంవత్సరాల తరబడీ వింటున్నానన్న సంగతి అతడికి తెలుసు. జేబులోంచి బీడీ కట్టను పైకి తీసిన తరువాత, వో బీడీ వెలిగించుకుని ''బీడీ గావాల్నా?'' అంటూ ప్రశ్నించాడు.

మునస్వామి సమాధానం చెప్పలేదు. పైకి లేచి, బీడీతోపాటు అగ్గిపెట్టెను గూడా మునస్వామి ముందుంచాడు తిరిపాలు.

బీడీ కొసల్లో అగ్గి రగిలీరగలక మునుపే గుప్పుగుప్పుమంటూ ముక్కుల్లోంచి పొగ వదల సాగాడు మునస్వామి. సగంబీడీ మసి రాలిపోయిన తరువాత, ''యీ పొద్దు కట్టెలోళ్లెవురూ అగుపించలేదా నీకు?'' అని అడిగాడు.

''యెవుడూ కనబల్లేదు'' అన్నాడు తిరిపాలు.

''నిజం చెప్పు...''

''అంటే అప్పటినుంచీ నేను అబద్ధం చెప్తా వుండాననా నువ్వు చెప్పేది?''

బీడీ ముక్కని విసిరి పారేసే వరకూ మునస్వామి మాట్లాడలేదు.

తిరిపాలు బీడీ పీకతో మరో బీడీని వెలిగించుకున్నాడు.

''వొరే తిరిపాలూ-రేపయినా, మొన్నాటికయినా చింతగుంట సాయిబు మేకల బేరానికొస్తే నా పొట్టేలుకు బేరం మాట్లాడు. వచ్చే వారంలో అమ్మేద్దామనుకుంటా వుండాను'' అన్నాడు మునస్వామి.

''అప్పుడే యేం తొందర? యింకో రెండు మూడు నెల్లుండు. పొట్టేలు కింకా చియ్య పట్టలేదు...''

''అట్టంతా అయ్యేది లేదులే! బేరం కుదిరించేయి... దుడ్డు అవసరం వచ్చింది. చేతిలో రూకల్లేవు...''

''చేతిలో దుడ్డుండాదని నువ్వు యెప్పుడయినా అన్నావా? నేను యినినానా?... కొన్ని దినాలు వోపికబట్టు. అమ్మినాక దుడ్డు నీకే యిస్తాన్లే? నేనేమయినా యెగ్గొట్టేస్తానా యేమయినానా?''

''అదంతా నీకనావసరం. చెప్పినట్టుయిను. రూకలుగావాల్ల. నా పొట్టేల్ని నేనమ్ముకోవాలని అనుకుంటా వుండాను. మిగిలిన మాటలు మాట్లాడద్దు...'' మునస్వామి విసుక్కున్నాడు.

''వొకమాటడుగుతాను...నిజెంచెబ్తావా మామా?'' తిరిపాలు రహస్యం చెబుతున్నట్టుగా గొంతు తగ్గించి మాట్లాడసాగాడు. ''ముప్పయి దినాలు లెక్క బెట్టుకుని, జీతం రూకలు తీసుకుంటావు. చాలనిదానికి పై సంపాదనవుండాది. అంతా యేంజేస్తావుండావు? బాంకులో యేమయినా యేసుండావా? యేసేవుంటావులే! నాకు తెలవదా? యెంతుండాది? పదిర్వై

వేలుండునా? వుంటాదిలే...!''

''వేల్లు గాదు... లక్షలుండాయి'' మునస్వామి కోపంగా అడ్డు తగిలాడు. ''నాకేమయినా వేల్లువేల్లుగా జీతమొస్తా వుండాదనుకుంటా వుండావా నువ్వు? రెండో తేదీ తీసుకున్న రూకలు మూడో తేదీ సాయంత్రానికి మాయమైపోతాయి. ఆ పొద్దుట్నించీ మళ్లా జీతమెప్పుడొస్తాదా అని యెగజూసుకోనుండాల. నాకేమయినా నీకు మాదిరిగా నేలాన్రా వుండాదని అనుకుంటా వుండావా? ఆరుమందుండే కుటుంబరం... యెన్ని ఖర్చులు? లీటరు చెనిగి సమురెప్పు డయినా కొంటివా నువ్వు? అన్నీ పండి వస్తావుంటే అందరూ నీ మాదిరే మాట్లాడ్తారు...''

''సరి సర్లే... నా అదురుష్టాన్ని జూసే కళ్లు కుట్టాల నీకు? వుండే రెండెకరాల చేన్లో పోయిన తడవ యిత్తనాలకు కూడా కాలా... యీసారి యింగా గింజలే యేయలా... యింకీసారికి బీడే... వానలుబడి యెన్ని దినాలయింది? యీ సమత్సరం తాగేదానికి నీళ్లు లేవు. యింగ చెనిగి తోట యేసినట్టే...''

మునస్వామి తిరిపాలు మాటల్ని వినిపించుకున్నట్టు లేడు... ''నిజం చెప్పు... కట్టెలోళ్లు నీకెవరూ అగపడలేదా?'' అంటూ మళ్లీ పాతప్రశ్ననే సంధించాడు.

''బాగుండాదిలే నీ యవ్వారం! పాడింది పాటగా చెప్తా వుండానే! నమ్మకం లేదా నీకు?'' తిరిపాలు ముఖం ముడుచుకున్నాడు.

''అందురూ అరిచ్చెంద్రులేలే! యేమన్నా అంటే కస్సుమని లేస్తారు. నేను కూడా చూస్తానే వుండాను, వొళ్లంతా కండ్లు పెట్టుకోని, తిరగలరాయి మాదిరిగా తిరగతా వుండాను. ఆకాడికి యిర్లోళ్లే మేలు. యీ మాలోళ్లూ, మాదిగోళ్లూ అడివికొచ్చే దానికి మొదలుపెట్నారు. బాగుండిన యిర్లోళ్లను గూడా పాడు చేసేసినారు. చూస్తా వుండగానే కండ్లపాపల్ని కొట్టుకొని పోయే రకం... మీ మేకలోళ్లకు మంచీ చెడ్డా లేకపోయె. కూడు పెట్టిన చెయ్యినే కోసేసే జాతి... నాకు తెలవకుండా యెవుడ్నీ అడవిదాటకుండా చూడమంటే నాకే పంగనామాలు పెడ్తావుండారు. వాళ్లూ మీరూ కూడబలుక్కోని నన్నే యామారిద్దామని చూస్తా వుండారేమో! అది మీ వల్లగాదు... నేనంటే యెవుడనుకో నుండారు మీరు? నేనంటే సామాన్యమని అనుకోనుండారేమో...''

దూరంగా యెండుటాకులు నలుగుతున్న శబ్దం వినిపించింది. వెంటనే మాట్లాడటం ఆపేసి, మునస్వామి చెవులు రిక్కించి శబ్దం వచ్చిన వైపు చూడసాగాడు. తిరిపాలు సైతం ఆవైపు దృష్టి సారించాడు.

కొండరాజు కోనవైపుకు వెళ్లే బాటపైన యెవరో వస్తున్న సవ్వడి...

వొకటి... రెండు.. మూడు... సీకి పొదల వెనుక ఆకులు నలుగుతున్న శబ్దం... తరువాత హఠాత్తుగా శబ్దం ఆగిపోయింది...

''యెవరక్కడ?'' మునస్వామి పైకిలేచి గద్దించాడు.

సమాధానం రాలేదు.

''బయటికి రా... నన్ను తప్పించుకొని పోదామనా? నీ వల్లగాదు... మర్యాదగా రా బయటికి...''

పొదల వెనకనుంచి రంగు వెలసిన యెర్రకోక తొంగిచూసింది.

''రా బయటికి... యెవురు నువ్వు?'' మునస్వామి కళ్లలో యెరుపు జీరలు వచ్చాయి. అతడు కోపంతో నిలువునా వణికిపోసాగాడు.

పొదల వెనక నుంచీ వో ఆకారం ముందుకు వచ్చింది.

పొగచూరిన పాత సత్తు గిన్నెలాంటి తల... గోగునార పోగుల్లాంటి వెంట్రుకలు...

''దండాలు దొరా...! నేను సామీ... మునెమ్మని...''

***

''బాగుండావాన్నా!''

తలతిప్పి చూశాడు సిద్దయ్యనాయుడు.

''నీకోసరం వూర్లోయెతకని తావు లేదనుకో! రచ్చపైన జూస్తిని... పంచాయితీ బోరుడ్డుకాడ జూస్తిని. యిస్పెట్టాకులాడతా వుండావేమోనని అస్పత్రి కాడికి పోతిని. కడాకు మీ యింటికాడికి పోతే, మీ అబ్బోడు రైల్వే స్టేషను కాడ చూడమని చెప్పినాడు. చక్కా యెలబారి వస్తావుండాను...'' అన్నాడు నాగులునాయుడు.

''యే దోవలో వచ్చినావు?''

''వూర్లో దూరి, చెరువు కట్టపైన్నుంచీ వచ్చినాను...''

''దోవలో కట్టెలోళ్లెవురయినా కనబడినారా?''

''కట్లోళ్లా... నాకెవురా కనబడ్లేదన్నా!''

తానుగూడా బాగిచెట్టు నీడలోని సిమెంటు బెంచీపైన కూర్చున్నాడు నాగులు నాయుడు. సగం యెండిన బాగిచెట్టు యెండను జల్లెడబడుతున్నట్టుగా కనిపిస్తోంది.

రైల్వే లైను పక్కలోని మిగిలిన నాలుగైదు చెట్లు గూడా సగానికి పైగా యెండిపోయి వున్నాయి.

ధాదాపు యాభై మీటర్ల పొడవున్న రైల్వే యినుపకంచె కొండశిలువ అస్థిపంజరం లాగుంది. దానికి వో చివర్లో బుకింగు ఆఫీసుంది. బనీను తొడుక్కొని, పాత దినపత్రికతో గాలి వీచుకుంటున్న యేజెంటు ముందువైపున్న వరండాలోని ప్రయాణికులతో కబుర్లు చెబుతున్నాడు. రైల్వే స్టేషనుకు పడమటి దిశలో, అరఫర్లాంగు దూరంలో పెద్ద చెరువు కట్ట కనిపిస్తోంది. దానికి వుత్తరంగా, వూరున్నట్టు తెలియజేయడం కోసమన్నట్టుగా నాలుగైదు గుడిసెలూ, రెండు మూడు మిద్దెలూ కనిపిస్తున్నాయి. రైల్వేలైనుకు రెండువైపులా కాంక్రీటుతో పోతపోసినట్టున్న బీళ్లు కొలువు తీరి వున్నాయి. రైల్వే లైను మలుపు తిరిగినట్టుగా కనిపిస్తున్న చోట, యెండ కాకిబంగారంలా మెరిసిపోతోంది.

''కట్టెలోళ్లతో నీకేం పని.... కొంపదీసి పొయిలోకి కట్టెలు కూడా కొంటా వుండావా నువ్వు?'' అని అడిగాడు నాగులు నాయుడు.

''మా తోటలో యెండిపోయిన మామిడిచెట్లు యింక రెండు మూడేండ్ల దాకా అయిపోవు. యీ తడవ వొద్దంటే వచ్చి పడతావుండేది యెండు పుల్లలు మాత్రమే గదా! అవిటిని గూడ రూకలిచ్చి కొనమంటావా నన్ను?'' సిద్దయ్య నిష్ఠూర మాడాడు.

''యింగయితే కట్టెలోళ్లతో నీకేం పనన్నా?''

''మనూరి మాలోళ్లూ, మాదిగోళ్లూ యిప్పుడు అడివికి పోతావుండారు గదా! వాళ్లతో కొంచెం పనుండాది...''

అయిదారు నిమిషాల తరువాత, మళ్లీ తానే ప్రశ్నించాడు నాగులు.

''మీరు చెరుకు గానిగాడతావుండారని చెప్పినారు. అయిపోయిందాన్నా...!''

''యాడయిపోయింది? బుద్ధిలేక మరదాంతోట పెట్టి కన్నుగసాట్లూ పడతా వుండాను... దాన్ని కాపాడుకోనొచ్చే దానికి దేవుడు కనబడినాడు. తోట మంచి జంపుపైకొచ్చే కాడికి బాయిలో నీళ్లయిపోయినాయి. టవునునించీ బోరింగు లారీని పిలిపించి బోరింగేయిస్తిని. యాభై అడుగుల్లో రాయి గనబడింది. పగులూ, రేత్రీ రెండు దినాలు బోరింగు కొడితే నీళ్లు కనబడినాయి. ఆరువేలు చిలుం వొదిలి పొయ్యింది. మిల్లుకు తోలదామంటే నా పెండ్లాం అరికీస్ వద్దనింది. గానిగ మొదలుపెట్టి పది దినాలయింది. కూలోళ్లతో దినామూ హరారత్తయిపోయింది. వొకనాకొడుకూ జాతయినోడు లేడు. వొక దినమొస్తే యింకొక దినం రాడు. ఒకవేళ వచ్చినాడే అనుకో, వాని కండ్లకు మనమే కూలోని మాదిరిగా కనబడతా వుండాము. బుద్దంటే యింగ గానిగాడకూడదని అనిపిస్తా వుండాది...'' సిద్దయ్య నిట్టూర్చాడు.

''ప్రతి సమత్సరమూ, గానిగాడినప్పుడంతా యీ మాదిరిగా అనుకుంటానే వుంటారు అందరూ. మళ్లా రెండు రూకలు యెక్కువగా కండ్ల జూడచ్చని రెక్కలు ముక్కలు జేసుకుంటారు. నువ్వయినా, నేనయినా, యిది యెప్పుడూ జరిగేదే గదన్నా...'' అన్నాడు నాగులు.

''యీ తడవ మాదిరి యెప్పుడూ లేదబ్బా! యీ కూలోళ్లు తెలివిమీరి పోయినారు. పడేవానికి తెలస్తాదిగానీ, నీకెట్ల తెలస్తాదిలే! నువ్వట్నే వేదాంతం మాట్లాడతావు...''

''దొంతులనిండా కావాల్సినవన్నీ వుండేవాళ్లకుగానీ, నాకు వేదాంతమెక్కడినుంచీ వస్తాదన్నా? నేను చెప్పేది వేదాంతం గాదు... పచ్చి నిజం. నీళ్లు లేక యెకరం చెరుకుదోట యెండబెట్టుకున్నోడ్ని. నాకుండే అనుభవంతోనే చెప్తావుండాను''

రాలిన యెండుటాకుల్ని జవురుకుంటూ రైల్వే ప్లాట్‌ఫారంపైన సుడిగాలొకటి సుళ్లు తిరుగుతోంది. స్టేషనులోని యేజెంటు ఫోన్లో మాట్లాడుతున్నాడు. తీగల్లేక పోయినా అవతలి స్టేషను వరకూ వినిపిస్తుందేమోనన్నంత బిగ్గరగా గొంతు చించుకుంటున్నాడతను. స్టేషను వరండాలోని ప్రయాణికుల సంఖ్య పది పదిహేనుకు పెరిగింది.

రెండుమూడు నిమిషాల నిశ్శబ్దానికి భగ్నం కలిగిస్తూ ''పొద్దన సద్దిబండి కాడికి వచ్చుంటివా, నువ్వు?'' అంటూ ప్రశ్నించాడు సిద్దయ్య.

''నేనా? రాలేదే? యేమి? నీకేమయినా పనుండిందా?'' నాగులు తలపైకెత్తి చూశాడు.

''పొద్దన సద్దిబండికి కట్నోళ్లెవురయినా పోయినారేమో తెలుసుకుందామని...''

కట్టెలు అవసరంలేకపోతే కట్టెలోళ్లతో మరేం పని! నాగులు విస్తుపోయాడు. ''గానిగకాడికి కూలోళ్లు దొరకలేదంటావుండావు. కట్టెలోళ్ల నెవురినయినా కూలీకి మాట్లాడుకుందామని అనుకుంటా వుండావాన్నా?''

''యిప్పుడు కట్టెలు తీసుకొనిపోయి, టవున్లో అమ్ముకునే మాలోళ్లు మనమాట యినేటట్టుండారా అయిలూ? సానా మాట్లాడితే మనల్నే కూలీకి రమ్మంటారు...'' అన్నాడు సిద్దయ్య.

నాగులుకు అతడి ధోరణి అర్థంగాలేదు.

బిక్కమొహం పెట్టుకుని దిక్కులు చూడసాగాడు.

జేబులోంచీ సిగరెట్టు పెట్టెను పైకి తీసి సిగరెట్టు వెలిగించుకున్నాడు సిద్దయ్య. రెండు దమ్ములు లాగిన తరువాత... ''సిగరెట్టు గావాల్నా?'' అంటూ ప్రశ్నించాడు.

''నా బ్రాండు నా దగ్గిరుండాదిలే అన్నా!'' తన సిగరెట్టు పెట్టెను చేతికి తీసుకున్నాడు నాగులు. అగ్గిపెట్టె కోసం చేయి చాపుతూ ''నీతో మల్లా పనిబడిందన్నా! యీసారి గూడా నువ్వే గట్టెక్కించాల...'' అన్నాడు.

సంగతేమిటన్నట్టుగా సిద్దయ్య కళ్లెగరేశాడు.

''రూకలు గావాల. చానా అవసరం. బాంకులోను తీసుకోవాలని అనుకుంటా వుండాను. ఆ మేనేజరుతో కొంచెం చెప్పాల నువ్వు...''

''లోనా? మల్లానా...? లోను తీసుకొని ఆర్నెల్లు గూడా గాలేదు. అంతలోనే యింకో లోనా?...''

''అవునన్నా! కావాల... ఆర్నెల్లముందు తీసుకున్న రెండువేలు యెన్ని దినాలుంటాది? అయిపోయింది. యిప్పుడు దుడ్డు పుట్టించే దారి యింగొకటి కనపడలేదు. కొంచెం మేనేజరుతో వొక మాట చెప్పినావంటే...''

''యెంత తెలిసినోడయితే మాత్రం మేనేజర్ను వూరికే మొగమాటం పెట్టేది బాగుంటుందా చెప్పు?... ఆ లోను తీర్చేసినాక నా దగ్గిరికి రా... అప్పుడు చెబ్తాను...''

''నువ్వట్లంటే నేనేం జెప్పుదునన్నా! లోను తీర్చేశక్తే గాని వుంటే మల్లా యింకో లోను కోసం దేవకలాడతానా చెప్పు... యెకరం చెరుకుతోట నీళ్లు లేక యెండబెట్టు కుంటినని చెప్తితిని గదన్నా! మన చెరువులో నీళ్లెండిపోయి యెన్ని దినాలయి పోయింది. చెరువు కింద నేల యెండిపోయింది. చెరువు నిండితే వొక పంటకు బయముండదు. కానీ నిండాల గదా! వానలు సరిగ్గా గురిసి రెండేళ్లయి పోయె. బాయినీళ్లను నమ్ముకోని చెరుకు తోట

పెట్టినందుకు మునిగిపోతిని. బోరింగేయిద్దామని తెచ్చినలోను యింటి ఖర్చుకే అయిపోయింది. బియ్యం కాడ్నించీ అన్నీ కొంటావుండాము. యెట్లయినా యింకో రెండువేలు లోను తీసిచ్చినావంటే యింకో రెండు మూడు నెలలు గడిపేస్తాము. వానలు పడి, చెరువు నిండిందంటే, రెండుపంటల్లో లోను తీర్చేస్తానం. నీకు చెప్పాల్సి నోడ్నిగాదు...''

''కనీసం మూడు నాలుగు సవరాల నగేదయినా వుంటే చూడు... నగ పెట్టుకుని లోనిమ్మని అడగదాం...'' అన్నాడు సిద్దయ్య.

''వెన్న వుంటే నెయ్యి కోసరం ఇల్లిల్లూ తిరగతానా అన్నా! బంగారం వుంటే యేకంగా అమ్మేసే వుందును...''

''అట్లయితే నేనేం చేసేదిరా అయిలూ? చెప్పమంటే వొకమాట మేనేజరుతో చెప్తాను. నానోరేమీ అరిగిపోదు. కానీ యిస్తాడని మాత్రం గారంటీ చెప్పలేను...'' అనేశాడు అతను.

''అట్లంటే యెట్లన్నా? యేమయినా గానీ, నువ్వు లోను తీసిస్తేనే మా పొయిలో పిల్లి లేసేది... లేకుంటే...'' నాగులు మాట్లాడలేకపోయాడు.

''చెప్పి చూస్తాన్లే... అయినా రోలొచ్చి మద్దెల్తో జెప్పినట్లు - యీ కాలంలో సేద్యం జేసేటంత బుద్ధిలేని పని యింకొకటి లేదు... ఫలితం కండ్ల జూసేదాకా గారంటీ లేదు. యెరువులు, కరెంటు చార్జీలు, మిషన్లకు కాయిల్‌లు, మల్లింక కూలీలు... తీరా ఫలితం చేతికొచ్చిందే అనుకో - ఖర్చులకూ, ఆదాయానికీ ఆడికాడికి సరిపోతాది. యింక మనకు మిగిలేదేముండాది?...''

''.........''

''వూర్లో సగానికి పైగా రైతులు బీళ్లు బెట్టేసినారు. మాలోళ్లకు కూలీ పనులు లేవు. వాళ్లు కట్టెల దుడ్డు రుచి జూసేసినారు. టవున్లో మోపుకు కనాకష్టం పద్దైదిరవై పలకతా వుందట... యీడినుంచీ టవునుకు పొయ్యేదానికి రైళ్లుండనే వుండాయి. టికెట్టా పాడా? పొద్దన లేసి అడివికి బొయ్యి వొక మోపు తెచ్చుకుంటే సాయంత్రానికి యిర్వై రూపాయలు చేతిలో పడతాయి. యిప్పుడెవురినయినా కూలీకి పిలువు. యెందుకొస్తారు? కండ్లు నెత్తిపైకొచ్చినాయి. వచ్చినారే అనుకో, దినానికి పద్దైదిమ్మంటారు. యిర్వై తెమ్మంటారు. యిక్కడ చెట్లకు రూకలు గాస్తా వుండాయా యేమయినానా?''

''........''

''రైల్లో కాలేజీలకు పోయే పిల్లకాయలకు నిన్ననే చెప్పినాను. మన స్టేషనులో నుంచీ వొక మోపు గూడా రైలెక్కగూడదు. రైలుండేది కట్టెలోళ్ల కోసం కాదు. యెవురైనా రైల్లో మోపేస్తే యెత్తి కిందపారేయమని చెప్పినాను. చూస్తాను, యెవుడేం చేస్తాడో...''

''........''

''మధ్యానం రైల్లో గూడా కొందరు మాలోళ్లు కట్టెల మోపెత్తుకోని పోతావుండారంట.

నిన్న రచ్చకాడ కనిపించిన రైతులకంతా చెప్పినాను. రోజా ప్రతి రైలుకాడికీ వచ్చి చూడమని చెప్పినాను. కట్టెల మోపులు రైలు యెక్కగూడదు. అదీ కట్టుబాటు... వానలు లేక, నీళ్ల లేక మనం అల్లకల్లోలంగా వుంటే, వీళ్లకు పండగ మాదిరిగా వుంది. వీళ్లకు...''

సిద్దయ్య అర్ధాంతరంగా మాట్లాడటం ఆపేసి, ప్లాట్‌ఫారం వెనకవైపున్న బాగిచెట్టుకేసి చూడసాగాడు. పైకిలేచి శబ్దం చేయకుండా అటువైపుకేసి నడవసాగాడు. నాగులు కూడా అతడినే అనుసరించాడు.

బాగిచెట్టు వెనుకవైపునుంచీ యెరుపురంగు చీర తొంగి చూసింది.

''యేయ్... యెవురక్కడ?'' అంటూ అవతలివైపుకు తొంగి చూశాడు సిద్దయ్య నాయుడు.

అయిదడుగుల పొడవున్న కట్టెల మోపు చెట్టుకవతల ఆనించి పెట్టబడి వుంది. దాని వెనకనుంచీ కొరివి కట్టెల్లాంటి నల్లటి చేతులు కనిపించాయి. మట్టితో చేసినట్టున్న పాదాలు ముందుకొచ్చాయి.

''దండాలు దొరా! నేను సామీ... మునెమ్మని...''

***

''హాల్టు స్టేషనులోగూడా ఫైవ్ సిక్స్ మినిట్స్ ఆపేస్తే యింకమనం టయానికి పోయినట్టే! విజిలేయండి సార్!'' అంటూ అండర్ గార్డు పెట్టెలోకి యెక్కాడు ప్రభుదాసు.

''పంక్చువల్‌గా టూమినిట్స్ కంతా బయల్దేరేసినావంటే చైన్‌పుల్లింగ్ తప్పదు. యెందుకయినా మంచిదని పాసింజర్లందరూ యేక్కేదాకా వెయిట్ చేస్తా వుండాను. ఈ వూరోళ్లు రైలొచ్చి స్టేషన్లో ఆగినాకగానీ యిల్లొదిలి పెట్టి బయల్దేరరు. దార్లో యెవురైనా రైలుకోసం వస్తా కనబడినారనుకోండి. వాళ్ల కోసరమని చెయిన్ లాగేస్తారు. అసలే అప్పు. వాక్యూమెక్కాలంటే పది నిమిషాలు పడతాది. పాసింజర్‌లో డ్యూటీ చేసే దానికంటే గొమ్మునుండేది మేలు...'' విజిల్ వూదడం కోసం వాక్ ప్రవాహాన్ని ఆపి, ఆకుపచ్చ జెండాను వూపసాగాడు యాసిన్ సాహెబు.

రెండు మూడు నిమిషాలసేపు కారుబారు చేసిన తరువాత, కొంత దూరం వెనక్కి నడచి, ఆ తరువాత ముందుకు దౌడు తీసింది రైలు.

స్టేషను దాటాక వంతెనపై కొచ్చింది.

యేటిలో యిసుక కూడా కనిపించడం లేదు. మైదానం లాగుంది. యెటు చూసినా జిల్లేడు చెట్లూ, పాలసంద్రం చెట్లూ, గవర్మెంటు ముండ్లచెట్లూ...

యేటికవతలనుంచీ మళ్లీ బీళ్లు... అక్కడక్కడా చెట్లు, యెండిపోయిన మోళ్లు... దూరంగా యెర్రమట్టి దిబ్బల్లా కనిపిస్తున్న కొండలు...

మధ్యాహ్నపు యెండ మండిపడుతోంది. నేల సైతం అద్దంలా తయారై సూర్యకిరణాల్ని రిఫ్లెక్ట్ చేస్తోంది.

కంపార్టుమెంటులోని ఫాను బడబడమని శబ్దం చేస్తోంది. చెక్క పెట్టెపైన కూలబడ్డాడు యాసిన్.

ప్రభుదాసు ధ్యానముద్రలో కూర్చుని వున్నాడు. తొడుక్కున్న నల్లకోటు వయస్సు అతడి వయసులో సగమైనా వుంటుంది. అక్కడక్కడా కుట్లూడిపోయి, పోగులు పోగులుగా వేలాడుతోంది. ఆజన్మప్రయాణికుడేమోననిపించేలా దుమ్ముగొట్టుకపోయిన వెంట్రుకలు.. యెరుపు జీరల కళ్లు... బుగ్గలో జరదా కిళ్లీ... పెదవులపైన యెరుపు మరకలు... రేజర్ మరచిన గడ్డం... వేళ్లసందున వెలుగుతోన్న సిగరెట్టు...

''చెకింగ్ అయిపోయిందా సార్?'' అని ప్రశ్నించాడు యాసిన్.

బలవంతంగా తలపైకెత్తి, కనురెప్పలు తెరచి - ''అప్పుడేనా? వొక బోగీలో చెక్ చేసేటప్పటికే తల ప్రాణం తోకకొచ్చేసింది. యిసికేస్తే రాలనంత జనం... చాలనిదానికి డోర్ దగ్గర కట్టెల మోపులు... లోపలికి పోలేము. పోయినామంటే తిరుక్కోని రాలేము... యేమయినా మీ మాదిరి అడిగిరాలేదు సార్ నేను... రైల్లో యెంత రష్ వుండినా మీకు బాధలేదు...'' అన్నాడు ప్రభుదాస్.

చిరునవ్వు నవ్వబోయినవాడల్లా అంతలోనే చిడిముడిపాటు పాడుతూ ''అదిగో, చక్రాలకు బ్రేక్ పడతావుంది. యెవుడో నాకొడుకు చెయిన్ పుల్ జేసినాడు. చూసినారా మేమెంత సుఖపడతా వుండామో'' అంటూ గేట్ దగ్గరికి వెళ్లాడు యాసిన్.

రైలు వేగం క్రమంగా తగ్గిపోసాగింది.

చివరికోచోట ఆగిపోయి, నీరసంతో మూలగసాగింది.

యాసిన్ కిందకు దిగేశాడు.

అతను వ్యాక్యూమ్ యెక్కడ లీక్ అవుతోందో తెలుసుకొని, సరిచేసి వచ్చి తిరిగి తన పెట్టెలోకి యెక్కేటంత వరకూ, ప్రభుదాసు ధ్యానముద్రలోనే వున్నాడు.

మళ్లీ రైలు కదిలింది.

ప్రభుదాసు కళ్లు తెరిచి ''స్టూడెంట్సేనా?'' అంటూ ప్రశ్నించాడు.

''కాదు... యెవరో కట్టెలోళ్లు... స్టేషన్లో అంతసేపు ఆపినా వాడెవుడో ఎక్కలేక పోయినాడంట... వాని కోసరమని చెయిన్ పుల్లింగు... వాడొచ్చి యెక్కేదాకా మనం అఘోరించాలంట... అట్లుండాది వాళ్ల దర్బారు... వీళ్ల కండ్లకు రైలు యెద్దుల బండికంటే కనాకష్టంగా కనబడతా వుండాది...''

''కట్లోళ్లంటే గుర్తుకొచ్చింది. లాస్ట్ వెడ్నస్‌డే యేం జరిగిందో తెలుసునా మీకు... '' సిగరెట్ వెలిగించుకోవడం కోసం ఆగాడు ప్రభుదాసు. ''అర్లీ మానింగ్ ట్రెయిన్.. అంటే అదే సార్ - వన్‌టొంటీత్రీ - వెస్ట్‌కు కిలోమీటరు దూరంలో యెవురో స్క్వాడ్ స్క్వాడ్ అని అరిసినారంట - కట్టెలోళ్లు ఫారెస్టోళ్లేమోననుకోని గబగబా రన్నింగ్ ట్రెయిన్‌నుంచీ మోపుల్ని కిందకు తోసేసినారంట. స్టేషన్లో దిగి బాక్కొచ్చి మోపులెత్తుకోని పోదామని వాళ్ల

ప్లాను. అర్లీ మార్నింగ్ ట్రాక్ పక్కన నడిచిపోతావుండే వానికెవుడికో, మోపుపైనబడి తల పగిలిందంట. గవర్మెంటు ఆస్పత్రిలో చేర్పించినారని విన్నాను. వాని పరిస్థితి క్రిటికల్‌గా వుండాదని రన్నింగ్ రూంలో యెవురో చెప్తావుంటే వింటిని...''

''పోలీసు రిపోర్టియ్యలేదా?''

''యిచ్చే వుంటారు. అయినా యెవుడినని అరెస్టు చేసేది? వొకరా యిద్దరా? యిన్వెస్టిగేషను జరగతానే వుండాది. అయినా కట్టెలోళ్లు యెవురూ ఆగలేదు. తమ పని తాము చేసుకోని పోతా వుండారు...''

వాటర్ బాటల్లోంచీ గ్లాసులోకి నీళ్లు వొంచుకుంటూ ''యీ సమత్సరం ఎండలు యెక్కువగా వుండాయి గదా సార్?'' అంటూ అడిగాడు యాసిన్.

''సంవత్సరం సంవత్సరానికీ చానా తేడా కనిపిస్తా వుండాది సార్! సూర్యుడు రానురానూ యెర్త్‌కు దగ్గరగా వస్తావుండాడంట. సైంటిస్టులు చెప్పినారని హిందూలో చదివినాను'' తనకు గూడా వో గ్లాసు కావాలన్నట్టుగా చేయి చాపాడు ప్రభుదాసు.

గ్లాసు ఖాళీ చేసిన తరువాత... ''మీరు యీ సమ్మర్‌లోనే మీ డాటర్ మారేజ్ ఫిక్స్ చేసుకున్నారని తెలిసింది... నిజమేనా సార్?'' అని అడిగాడు ప్రభుదాసు.

''అవునుసార్.. అట్లా కుదిరింది. వూర్లో నీళ్లు గూడా లేవు. వచ్చే నెల తర్టీన్త్ మారేజ్... డ్రమ్ముల్తో నీళ్లు తోలించాల.... బాడుగకు మాట్లాడేసినాను...''

''బ్రైడ్‌గ్రూం యేంచేస్తావుండాడుసార్?''

''పీడబ్ల్యూడీలో సూపర్వయిజరు. పాలిటెక్నిక్‌లో యల్‌సీయీ చదివినాడు...''

''మంచి సంబంధమే! కట్నమెంత యిస్తావుండారు?''

''క్యాష్ ట్వంటీఫైవూ, గోల్డ్ ట్వంటీఫైవూ...''

పెండ్లి ఖర్చులకు యింకో ట్వంటీఫైవూ... మొత్తానికి వన్‌లాక్ అయిపోతాది. అయినా మీకేం సార్! బాగా మిగలబెట్టుంటారు. వుంది. పెడతారు. మాలాంటోళ్లయితే బయపడాలగానీ...''

''నా దగ్గర మాత్రం యేముండాది సార్! ట్వంటీ యియర్స్ సర్వీసులో మిగలబెట్టింది గుండుసున్న. జీతంలో సగం పైన తీసుకున్న అప్పులకు కటింగ్ అయిపోతాది. మిగలిన సగం ఫిఫ్టీన్త్‌కంతా ఫినిష్... మళ్లా అప్పు... పెండ్లి కోసరం అప్పు చేసినాను. మొత్తానికి యాభై అప్పు చేసినట్టు లెక్క.... అంతటితో బయటపడితే చాలు...''

''వొక కూతురుండే మీరూ అంత కష్టపడితే యిద్దరుండే నేనేమనాల సార్? తలుసుకుంటేనే భయంగా వుండాది నాకు...''

''తలుసుకునే వీలు లేకుండా యెప్పుడూ గుర్రమెక్కేస్తారు గదసార్! మీ సంగతి నాకు తెలియదా చెప్పండి?...'' యాసిన్ నవ్వేశాడు.

''ముందు మాదిరిగా యిప్పుడు లేదు సార్! బాగా తగ్గించేసినాను. చెపితే యెవురూ

నమ్మేదిలేదుగానీ యిప్పుడు యెప్పుడో వారానికో సారి.. అంతే...'' బతిమాలుకున్నట్టుగా అన్నాడు ప్రభుదాసు.

రైలు పెద్దగా కేకేసింది.

''అప్పుడే స్టేషను వచ్చేసిందే....'' అంటూ పైకి లేచాడు యాసీన్.

''రైలుకు యీపొద్దుగూడా క్రాసింగ్ వుందా సార్?'' అని ప్రశ్నించాడు ప్రభుదాసు.

''గ్యారంటీగా వుంటాది సార్! యిక్కడ మనకు అరగంట వెయిటింగ్ తప్పదు...''

రైలు ఆగుతూనే ప్లాట్‌ఫాం పైకి దిగేశాడు యాసీన్.

దాదాపు డెబ్బయి మీటర్లున్న మట్టి ప్లాట్‌ఫాం. చిన్న బుకింగు ఆఫీసు... సిగ్నల్స్ యివ్వడం కోసం కేబిను...

''నమస్కారం సార్!''

వెనుదిరిగి చూశాడు యాసీన్.

''నువ్వా యేడుకొండలూ! యీ పొద్దు యెన్ని?''

''ముప్పయినాలుగు సార్...''

''కరెక్టుగా లెక్కబెట్టినావా?''

''నేనెప్పుడయినా అబద్దం చెప్పినానా సార్?''

''రోజూ ఆమాటే అంటావు. తీరా లెక్కబెట్తే నాలుగయిదయినా యెక్కువగా వుంటాయి. నేను తప్పు చెబ్తావుండానని మా గార్డు అనుకుంటాడు...''

''యీ పొద్దు కచ్చితంగా ముప్పయి నాలుగే సార్...''

''యెవుడు చూసినాడ్లే... లెక్కబెడదాంపదా...''

కంపార్టుమెంట్లు తనికీచేస్తూ నడవసాగాడు.

వో కంపార్టుమెంటు దగ్గరికొచ్చి, మోపుల్ని లెక్కబెట్టుకున్నాక, ముందుకు కదల బోయిన వాడల్లా ఆగిపోయి- ''యేడుకొండలూ! ఆ లెట్రిన్‌లో వొక మోపుండే టట్టుంది చూడు'' అంటూ ఆజ్ఞాపించాడు.

''అవున్సార్! వుండాది... నాకుగూడా టోకరా యిచ్చేసినారెవురో'' యేడుకొండలు కంపార్టుమెంటులోకి యెక్కి లావెట్రీ తలుపులు తెరవడానికి ప్రయత్నించసాగాడు.

''యీ కట్టెలోళ్లు కంత్రీలు... మీరు కేర్‌ఫుల్‌గా వుండాల సార్''

యాసీన్ వెనుదిరిగి చూసి... ''మీరా సార్... యింకా పెట్లోనే వుండారనుకుంటినే...'' అంటూ కళ్లెగరేశాడు.

''మీకు హెల్ప్ జేద్దామని'' ప్రభుదాసు పెదవులు సాగదీశాడు.

''సార్‌సార్... కట్ల మోపేగాదు. దాన్నెత్తుకొచ్చిన ఆసామిగూడా లోపలే వుండాడు...''

కేకేశాడు యేడుకొండలు.

''యెవర్రా లోపల... బయటికిరా...'' యాసీన్ హుంకరించాడు.

లావెటరీలోంచీ వంగిన వెదురుబద్దలాంటి ఆకారం బయటికి అడుగుపెట్టింది.

''దండాలు సామీ! నేను దొరా... మునెమ్మని...''

***

వెస్ట్ రైల్వేస్టేషను ప్లాట్‌ఫాం నిర్మానుష్యంగా వుంది.

దూరంగా, రైల్వేలైను పట్టణంలోకి మలుపు తిరిగే చోట, సిగ్నల్ స్తంభం కత్తిపైకెత్తుకుని నిల్చున్న కసాయివాడి నీడలా కనబడుతోంది.

వెయిటింగ్ రూంలో కూర్చుని సిగరెట్టు దమ్ములాగుతూ - ''చూడబోతే యీ వెస్ట్ రైల్వే స్టేషన్ను కట్టెలోళ్ల కోసమనే పెట్టినట్లుండారు...'' అంటూ ముక్తాయించాడు రేంజరు పార్థసారధి.

చుట్టూ నిల్చున్న గార్డులు సమాధానంలా పళ్లికిలించారు.

''కాలేజీలకుపోయే స్టూడెంట్లకు సౌకర్యంగా వుంటుందని పెట్టిన రైల్వేస్టేషను; వాళ్లకంటే కట్టెలోళ్లకే సౌకర్యంగా వుంది. యిక్కడ అయితే రద్దీ వుండదు. ఆపి, నిలేసేటందుకు రైల్వేస్టాపుండదు. మహరాజుల్లా కట్టెల మోపు దించుకొని, వూరిలోకెళ్లి పోవచ్చు. మెయిన్ స్టేషను లోపలయితే వీళ్ల పప్పులుడకవు..''

''అంతేగాదు సార్... యీ స్టేషనుకు వొకపక్క కాంపౌండు వాల్ గూడా లేదు. టిక్కెట్టు కొన్నావా లేదా అని అడిగే నాధుడుగూడా వుండడు...'' అన్నాడో గార్డు.

''టైమెంతయింది?'' వాచీ చూసుకునే వోపిక సైతం లేనట్టుగా ప్రశ్నించాడు పార్థసారధి.

''నాలుగు సార్...''

''రైలు టయిమయినట్టేనా?''

''మూడున్నరకి రావాలసార్... యెప్పుడూ టయానికి రాదనుకోండి... అయితే రైలు అవుటయిందంట! స్టేషను మాస్టరు చెప్పినాడు...''

''మన వాళ్లందరూ పొజిషన్లు ఫిక్స్ చేసుకున్నారా?''

''అంతా రెడీగానే వుండాము సార్! వొకడు గూడా తప్పించుకొనిపోయే వీలు లేదు...''

''నమస్తే సార్...''

''వోహో... వరదరాజుగారా! రండి... రండి... కాఫీ తీసుకుంటారా?''

కుర్చీలో కూర్చుంటూ... ''వద్దండీ... తాగేసి వచ్చాను'' అన్నాడు వరదరాజు.

''హోటలు ప్రొప్రైటరుకు కాఫీ దొరక్కపోతుందా? కంపెనీ కోసం కొంచెం పుచ్చుకోండి...'' అన్నాడు పార్థసారధి.

గార్డు వో కప్పు వరదరాజు ముందుంచాడు.

''మేం రెయిడ్ చేయబోయే సంగతి మాకంటే మీకే ముందుగా తెలిసేటట్టుంది...'' నవ్వుతూ అన్నాడు పార్థసారధి.

''అయ్యయ్యో! అదేమీ లేదుసార్... యిప్పుడే తెలిసింది... మామూలు మాదిరిగా మా మేనేజర్ని పంపిద్దామనుకుంటిని... ప్రతిసారీ పరాయి వాళ్లనే పంపిస్తే పని మనకెట్లా తెలుస్తాది చెప్పండి...? అందుకని నేనే వస్తిని...''

''మీరొకరేనా... యింకా యెవరైనా వస్తున్నారా?''

''ఆ సంగతి నాకు తెలియదు సార్''

''మీరొక్కరే వస్తే యాక్షన్ యెలా వేస్తాం సార్? యింకో పార్టీ గూడా వుండాలి గదా! యెవరినయినా తీసుకురాకపోయారా?''

''నాకు పోటీగా నేనే యింకొకడిని పిలుచుకొని రావాల్నా సార్! మీరు చెప్పేది బాగానే వుండాది...'' వరదరాజు శరీరం కదలిపోయేలా నవ్వసాగాడు.

''కాంపిటీషన్ లేకుండా యాక్షన్ యెలా జరుగుతుందండీ?'' చీకాకు పడ్డాడు పార్థసారధి.

''మీరు అంతా రూల్ ప్రకారమే చేయాలనుకుంటే యింకో మనిషిని గూడా నేనే అరేంజ్ చేస్తానులెండి సార్... మీకేమీ భయమొద్దు... ఆ సంగతి అట్లాపెట్టండి... మిమ్మల్ని కలిసి చానా రోజులయిపోయింది. సమాచారాలు చెప్పండి. మీ కుమారుడికి యింజనీరింగు సీటు దొరికిందా లేదా?...'' అంటూ అతడ్ని ముగ్గులోకి దించేశాడు వరదరాజు.

తరువాత పదినిమిషాలకు గానీ రైలు కూత వినిపించలేదు.

వరదరాజుతోబాటూ వెయిటింగ్ హాలు బయటికొచ్చి సిమెంటు బెంచీపైన కూర్చున్నాడు పార్థసారధి.

తన శరీరం తనకే బరువైపోయిన స్థూలకాయురాలిలా రొప్పుతూ రొజుతూ స్టేషనులో కొస్తోంది రైలు.

ఆ తరువాత దాదాపు అయిదారు నిముషాలసేపు రైల్వే ప్లాట్‌ఫాం పోటొచ్చిన సముద్రంలా తయారైపోయింది.

స్టేషనులో తమ కోసం వలపన్నుకుని కూర్చున్న వేటగాళ్లున్నారన్న సంగతిని వాసన పట్టగలిగిన కుర్రవాళ్లు కొందరు, తమ కట్టెల మోపుల్ని అక్కడికక్కడే కిందికి దొర్లించేశారు.

వేగంగా వస్తున్న రైల్లోంచీ కిందపడిన మోపులు, కట్టుదారాల్ని తెంపుకొని, గ్రెనేడ్లలా పైకెగరసాగాయి. వాటితోబాటూ రైల్వే ట్రాకుపక్కలున్న గులకరాళ్లు గంతులేయసాగాయి. రైలు స్టేషనులో ఆగీ ఆగకమునుపే కొందరు రైల్లోంచీ కిందకు దూకి, మోపుల్ని తలలపైకి లాక్కుని, పరుగులు తీయసాగారు. తొక్కిసలాటలో నిలబడలేక నేలపైన పడిపోయిన

వాళ్లు, నఖశిఖ పర్యంతం మట్టిని పులుముకుని కట్టెల మోపుల్ని బీజారుకోసాగారు. మోపుల్ని కిందికి దొర్లించినవాళ్లు, రైల్లోంచీ కిందకు దూకి, వెనకకు పరిగెత్తి, వూడిపోయిన మోపుల్ని జవురుకోసాగారు. యీ హడావుడిలో మోపులు తమకు తగులుతాయో మోనన్న భయంతో స్టేషనులో దిగవలసిన ప్రయాణికులు పెట్టెల్లోనే వొదిగిపోయారు.

రైల్వే ట్రాకు కిరువైపులా నిల్చున్న ఫారెస్టు గార్డులు, దొరికినవాడిని దొరికినట్టుగా నాలుగు వాయించి, మోపుల్ని లాక్కొచ్చి రేంజరు ముందు పోగుచేయసాగారు. కొందరు గార్డులు పారిపోతున్న వాడివైపుకు లాఠీని విసిరేసి, వాడు పడిపోగానే, మోపును ప్లాట్‌ఫాంపైకి లాక్కురాసాగారు.

రేంజరు పార్థసారథి పైకిలేచి నిల్చుని - ''అదిగో... వాడు... ఆ యెరుపు బనీనువాడు పారిపోతున్నాడు... యిదిగో మూర్తీ... పరిగెత్తు... పట్టుకోవాడ్ని... రాధాకృష్ణా... వదిలిపెట్టొద్దు...'' అంటూ కారుబారు చేయసాగాడు.

జరుగుతున్న తతంగంతో తనకేమీ సంబంధం లేదన్నట్టుగా పెద్ద నిట్టూర్పు వదిలిపెట్టి రైలు వెళ్లిపోయింది.

స్టేషనులో దిగిన ప్రయాణికులు నాలుగయిదు అడుగులకోసారి చిన్న పర్వంతలా పడివున్న కట్టెల మోపుల్ని వెనుదిరిగి చూస్తూ ముందుకు కదలసాగారు.

''కనీసం పది మోపులయినా చేయిజారిపోయుంటాయి సార్!'' అన్నాడు వరదరాజు.

''యీ పొద్దు మామూలుకంటే చానామంది వచ్చినారు. మేముండేది పదిమంది. వాళ్లేమో దగ్గిర దగ్గిర యాభై అర్వై మందుంటారు. లేకపోతేనా?...'' అంటూ వోగార్డు వరదరాజువైపు కొర కొరచూపులు చూడసాగాడు.

''సార్ సార్! అట్లా చూడండి... ఆ ముసిలిదెవురో కట్టెల మోపెత్తుకోని, పెండ్లికి పోయినంత మెల్లిగా నడిచిపోతావుంది...'' వరదరాజు కేకేశాడు.

గార్డు అటువైపు పరిగెత్తాడు.

''ఆ సంగతి మావాళ్లు చూస్తారుగానీ, మీరు నింపాదిగా కూర్చోండి. లేకపోతే వేలంపాట పాడటానికి యెవరైనా వస్తారేమో చూడండి'' సిమెంటు బెంచీపైన కూలబడుతూ అన్నాడు పార్థసారధి.

కొందరు గార్డులు కట్టెల వాళ్లు వదిలిపెట్టి వెళ్లిన మోపుల్ని యింకా పోగుచేస్తూనే వున్నారు. వొకతను మోపుల్ని లెక్కబెట్టసాగాడు.

''మోపు పెరుక్కోని రమ్మంటే మీగార్డు కట్టెలామెను గూడా పిలుచుకోని వస్తానుండాడు సార్'' అన్నాడు వరదరాజు.

''యీ ముసిలిదెవురో వుపాతకందిగా వుండాదిసార్...'' గసబోసుకుంటూ దగ్గిరి కొచ్చాడు గార్డు. ''నన్ను చూసిగూడా చక్కా నడస్తానే వుంది. మోపు యియ్యమంటే యియ్యనంటా వుంది. మాటలతో పని జరిగేట్టు లేదు. రెండు పెట్లిద్దామంటే వొకదెబ్బకే

హరీ మనేటట్టుంది. మా రేంజరుతో మాట్లాడదాం రమ్మంటే, సరే పద మంటా వస్తావుంది'' అన్నాడు.

దగ్గరికి రాగానే మోపు దించి నిల్పోబెట్టి, దాన్ని పట్టుకునే నిల్చుంది ఆవిడ.

''యేయ్ ముసిల్దానా! యేమిటి కథ? వొళ్లెలా వుంది...''

ఆమె తల పైకెత్తలేదు.

''కట్టెల మోపు వొదలిపెట్టి వెళ్తావా... లేకపోతే జైలుకు వెళ్తావా?''

''....''

''మన్నుతిన్న పాములా నిల్చుంటావేం? యెవరు నువ్వు? నీ పేరేమిటి?''

''మునెమ్మసామీ...''

''చెప్పు జైలుకు పోతావా?''

ఆమె తలపైకెత్తింది.

''పోతాను సామీ...''

పార్థసారధి వులిక్కిపడ్డాడు.

''యేమిటీ? పోతావా? జైలంటే యేమని అనుకున్నావు.. మర్యాదగా మోపు వదిలిపెట్టేసి వెళ్లిపో... కట్టెలమోపు కోసరమని జైలుకు పోతానంటున్నావు... జైలంటే ఫైవ్‌స్టార్ హోటలనుకున్నావా...?''

ఆమె వో నిట్టూర్పు వదలిపెట్టింది.

''యీ మోపు మీకు కట్టెల మోపుగా కనిపిస్తా వుండాదేమో సామీ! యిది నాకు ప్రాణం... యిది నా రక్తం... యిది నా చెమట సామీ...!''

''కథలుబాగానే చెబుతున్నావు! కట్టెలు దొంగతనంగా అడివిలోకొట్టుకొచ్చి అమ్ముకోవడం తప్పు... ఆ సంగతి తెలియదా నీకు?...''

''తప్పేసామీ!''

''తప్పని తెలిసీ యెదురు మాట్లాడుతున్నావా?''

''కడుపుకు తప్పొ గిప్పొ తెలియవు సామీ! యింటికాడ ముగ్గురు బిడ్డలు చూస్తా వుంటారు. సాయంత్రం నేనింటికి పోతేనే పొయిలో పిల్లి లేసేది. పోతే నూకలతో యింటి కయినా పోవాల... లేకపోతే యాడికిపోయినా వొకటే దారా నాకు...''

''యేదో ముసలిదానివని కనికరం చూపిస్తే కథలు చెబుతున్నావా? తిండి కోసరమే అయితే యింకో మార్గమే లేదా నీకు?'' పార్థసారధి గద్దించాడు.

''లేదు సామీ... వుంటే యీ పని చేసేదాన్ని గాదు. పతి సమత్సరమూ, యెప్పుడో వొకప్పుడు యీ పని చెయ్యకపోతే జరగదు సామీ మాకు... కూలీ పనులు దినమూ దొరకతాయా దొరా! వూర్లో రైతులు కూలీకి పిలుస్తా వుంటే, యీ పని చేసే జన్మగాదు

నాది. వొకరు సంపాదిస్తే మిగిల్నోల్లంతా కూచోని తినేదానికి మా కెవ్వురికీ గవర్మెంటు ద్యోగాలు లేవు సామీ! యింట్లో వుండేవాళ్లు అందరూ కూలీకి పోవాల్సిందే. అవుతే యీ పని పిలకాయలవల్ల కాదుగదా! మా ముసిలాయన చేయలేడు గదా! నాకు తప్పదు... యీ సమత్సరమసలు వానల్లేక రైతులందరూ యవసాయమే చేయలేదు సామీ! యింక మాకు పనులెక్క డుంటాయి?...''

''యీ రామాయణమంతా మనకెందుకు సార్! గార్డుతో చెప్పి మోపు పెరికి అక్కడ వేయమని చెప్పండి...'' వరదరాజు అడ్డు తగిలాడు.

''వేలంపాట పాడేదానికి యెవరైనా వస్తున్నారేమో చూడండి, మీ పనే చేద్దాం'' అన్నాడు పార్థసారథి.

''దొరా! నేనొక మాట చెప్తాను... యేమీ అనుకోవద్దు...'' ఆమె పొడిగించింది. ''యీ మోపు వూరికే వచ్చిందని అనుకుంటా వుండావు గదా! అదేం లేదు సామీ! ఫారెస్టు గార్డుకు తలా కొంచెమిచ్చినాము. రైలు గార్డులకు, టిగట్లాయనకూ యిచ్చినాము. చాలని దానికి వూళ్లో రైతులు అడ్డం పడితే కాళ్లావేళ్లా పడినాము. కూలీ రూకలు చానాగావాలని అడగమని పమాణకం చేసినాము. దినమూ, మా వోళ్లంతా అనుకుంటా వుండారుగానీ, నీతో చెప్పేదానికి బయపడతా వుండారు. అయితే వాళ్లకు లేని ధయిర్నం నాకెట్లా వచ్చిందని అడగతావేమో! నిండా మునిగినదానికి భయమేల చెప్పు? నా మాట నీకు బాగుంటే యిను. లేకపోతే జైలుకేస్తే జైలుకే పోతాను. అదీ వొద్దు. గారుడ్డులతో చెప్పి నా వొళ్లు హూనం జేస్తానంటావా, దానికీ సిద్ధమైపోయినాను సామీ... అందుకే ధయిర్నం... మేమంతా ఫారెస్టు గారుడ్డుకు, రైలుగారుడ్డుకూ యిచ్చినట్టుగానే నీకూ తలా కొంచెం యిస్తాము. వారానికోతూరి యీ బాధ పడలేకపోతా వుండాము దొరా! మా కష్టం యెంతమంది తినలేదు. నీకూ కొంచెం యిస్తాము. మమ్మల్నిట్ట మా మానాన వొదిలేస్తే అదే పదివేలు తండ్రీ!''

''మీకే లంచం యిస్తానంటా వుంది. చూస్తా వూరికే వుండారేంది సార్?'' వరదరాజు ఆక్రోశించాడు.

''నాకు యేమీ తెలియదని అనుకుంటా వుండావేమోగానీ అన్నీ తెలుసులే సామీ! యీ కట్టెల మోపుల్ని మేము పోయినాక యేలం యేస్తారంట గదా? యెవురు యెక్కువగా పాడితే వాళ్లకమ్మేసి రూకలు గవర్నమెంటుకిచ్చేస్తారంట గదా! యీ కట్టెల్ని హోటలోళ్లు చానా తక్కువకు పాడుకుంటారంటగదా! ఆ రూకలు మేమే తలా కొంచెం యేసుకొని యిచ్చేస్తాం... కాకుల్ని గొట్టి గద్దలకెయ్యొద్దు సామీ...''

''సార్‌సార్... ముసల్ది పెద్దపెద్ద మాటలు పేలుతోంది. వాళ్లు కాకులంట... మేమేమో గద్దలంట... అయితే మీరు లా అండ్ ఆర్డర్ కాపాడేవాళ్లు.... మిమ్మల్ని యేమని పిలస్తాదో యేమో...'' వరదరాజు గోలపెట్టసాగాడు.

''కొంచెం మాపైన దయచూపెట్టు సామీ... యీ మోపులకోసరమని మేము పొద్దు

పుట్టకముందే అడివికి పోయినాము. పుద్దానందాకా పుట్టలూ గుట్టలూ తిరిగి సంపాయించినాము. అప్పటినుంచీ పేటకు తెచ్చేదాని కోసరం అందురి కాళ్లా పట్టుకున్నాము. జాతర్లో పుట్టి గొట్టేదానికి యెంత అపస్త పడాల్నో తెలుసును గద సామీ! అంత అవస్త పడినాం సామీ... యెందురు అడ్డు పడినారు? అందురికీ వాళ్లక్కావాల్సింది వాళ్లకిచ్చినాం సామీ! చేతిదాకా వచ్చిన ముద్ద నోట్లోకి పోకుండా చెయ్యద్దు... నాకంటే చిన్నోడుగా వుండావు! నా కొడుకంత వుంటింది నీ వయసు. అయినా రెండు చేతులూ యెత్తి దండం పెడ్తావుండాను. మమ్మల్ని కాపాడు సామీ...''

పార్థసారథి గిరుక్కున వెనుదిరిగి వెయిటింగ్ రూములోకి వెళ్లిపోతూ, ''యిదిగో మూర్తీ... యీ ముసలిదానితో నేను మాట్లాడలేను. మాటల్తో పని జరిగేట్టు లేదు. కొంచెం దీని సంగతి చూడు'' అంటూ ఫర్మానా జారీచేశాడు.

వరదరాజు అతడి వెనకే వెయిటింగ్ రూములోకి వెళ్లాడు.

''యింతమాత్రానికి మీరింత బాధపడిపోతే యెట్లసార్! రూలు సార్.. మీరంతా రూలు ప్రకారమే చేస్తావుండారు. మీరేం చేస్తారు? యమధర్మరాజు సింహాసనాన్ని వెంట్రుకతో వేలాడదీసినారంట సార్! ఆయన తప్పుచేస్తే, అన్యాయం చేస్తే అది తెగిపోతుందంట సార్! న్యాయం, రూలు... అంతా కత్తిమీద సాముగదా సార్ మీ పని?....''

వరదరాజు అందించిన సిగరెట్టును వెలిగించుకుంటూ పార్థసారథి అన్నాడు- ''నిజమేనండీ... మనం చేసేదేమీ వుండదు.. రూల్సు చేతిలో మనం కీలుబొమ్మలం... యీ రూల్సు యెవరు ఫ్రేం చేశారో కానీ, వాడు భలే కంత్రీగా వుండి వుంటాడు...''

''నిజం చెప్పినారు సార్'' వరదరాజు భుజాలెగరేశాడు.

''ఆ ముసలిది కాకుల్ని-గొట్టి గద్దలకెయ్యొద్దు అన్నది గదా! యింతకూ నేనెవరండీ? నేను కూడా గ్రద్దనేనా?...''

''ఛ... ఛ... మీరు గద్దలెట్లవతారు సార్?''

''మరి... అయితే నేనుగూడా కాకినేనంటారా...?''

సమాధానం తెలియదన్నట్టుగా వరదారాజు పెదవి విరిచేశాడు.

***(1988,** విపుల మాసపత్రిక)*